# మూడో రోజు 24,049

- 'ప్రజా పాలన'కు పెద్దఎత్తున దరఖాస్తులు
- ఇప్పటి వరకు 52,971 స్వీకరణ
- కేంద్రాలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతున్నది. పలు గ్రామాలు, వార్డుల్లో ప్రజల నుంచి శనివారం 24,049 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు మూడు రోజుల్లో కలిపి 52,971 దరఖాస్తులను అధికారులు స్వీకరించి, సంబంధిత రసీదులు అందించారు. పలు గ్రామాలు, వార్డుల్లోని కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, పరిశీలించారు. ప్రజలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

*– వేములవాడ/సిరిసిల్ల రూరల్/ ఇల్లంతకుంట/ కోనరావుపేట/ రుద్రంగి/ గంభీరావుపేట/చందుర్తి, డిసెంబర్ 30*

వేములవాడ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని పద్మశాలీ కల్యాణ మండపంలో ప్రజా పాలన దరఖాస్తులను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పరిశీలించారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో లచ్చాలుతో కలిసి జడ్పీటీసీ మంజుల పర్యవేక్షించారు. చందుర్తి మండలం రామారావుపల్లిలో ఏర్పాటు చేసిన కౌంటర్లను అదనపు కలెక్టర్ గౌతమి పరిశీలించారు. ఏర్పాటు చేసిన కౌంటర్లు, స్వీకరించిన అర్జీల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అలాగే జోగాపూర్, రామారావు పల్లె, కట్ట లింగంపేట గ్రామాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ జడ్పీటీసీ నాగం కుమార్, ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్ కుమార్, ఏపీఎం రజిత, తదితరులు ఉన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట, దమ్మన్నపేట, ముస్తఫానగర్, లక్ష్మీపూర్‌లో ప్రజా పాలన కార్యక్రమాన్ని జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు ప్రారంభించారు. రుద్రంగి మండలం రూప్లానాయక్‌తండాలో దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇల్లంతకుంట మండ లం పొత్తూరులో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఆర్డీవో పరిశీలించారు. కోనరావుపేట మండలం మంగళపల్లి, సుద్దాల, కమ్మరిపేటతండా, మర్రిమడ్ల గ్రామాల నుంచి 1,319 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.


వీర్నపల్లి: దరఖాస్తులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### సంక్షేమాన్ని కొనసాగిస్తాం: విప్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబర్ 30: అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఎల్లారెడ్డిపేట మండలం సింగారం, వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండాలో ప్రజాపాలన కార్యక్రమాలకు హాజరై, మాట్లాడారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ డిప్యూటీ సీఈవో మచ్చ గీత, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ గుగులోత్ కళావతి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో 980, బండలింగంపల్లిలో 890, సింగారంలో 266, పదిరలో 302మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.


వేములవాడ: సుభాష్‌నగర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి


చందుర్తి: రామారావుపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి


ఇల్లంతకుంట: పొత్తూరులో కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

## నేడు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, డిసెంబర్ 30: న్యూ ఇయర్ వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలకు అనుమతి లేదని, మైనర్లు బైక్ నడుపుతూ పట్టుపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. అధిక శబ్దాలు చేస్తూ, వాహనాలు అజాగ్రత్తగా నడపవద్దని సూచించారు. అర్ధరాత్రి 12:30గంటల లోగా వేడుకలు ముగించుకోవాలని తెలిపారు.

### నేడే మల్లన్న కల్యాణం

చందుర్తి, డిసెంబర్ 30: శ్రీ మోహినికుంట మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవాన్ని నర్సింగాపూర్‌లో ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ నక్క గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ అర్చకుడు తమ్మల భద్రయ్యశర్మ తెలిపారు.

### కథల పుస్తకాల పంపిణీ

కోనరావుపేట, డిసెంబర్ 30: నిమ్మపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో లంబాడీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ ఆధ్వర్యంలో కథల పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. సుమారు 30 కథల పుస్తకాలు అందజేశారు. ఇక్కడ హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ అజీం పాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత


గాంధీచౌక్: లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

వేములవాడ/ గాంధీచౌక్, డిసెంబర్ 30: లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజీమార్గం ద్వారా తమ కేసులు పరిష్కారం చేసుకుంటే నగదు, సమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో 2,481 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, లోక్‌అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, కక్షిదారులు ఉన్నారు. అలాగే వేములవాడ కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సత్తు రవీందర్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇక్కడ ఏపీపీ విక్రాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, తదితరులు ఉన్నారు.

### కులవివక్ష పాటిస్తే చర్యలు

ఇల్లంతకుంట/ రుద్రంగి, డిసెంబర్ 30: కులం పేరుతో దూషించవద్దని, ఎవరైనా కులవివక్ష పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం గుడెప్పల్లి, రుద్రంగి మండలం వీరునితండాలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులందరూ కలిసిమెలిసి ఉంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఇక్కడ ఎస్సీ, ఎస్టీ కమిషన్ జిల్లా సభ్యుడు పసుల బాలరాజు, సర్పంచ్ గుగులోత్ మేన, ఎంపీడీవో శంకర్, తదితరులు ఉన్నారు.

### ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

తెలంగాణ చౌక్, డిసెంబర్ 30: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంపొందించుకొని, పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ రాజు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు సెఫ్టీ ఎడ్యుకేషన్ తరగతుల్లో భాగంగా అవగహన సదస్సు నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. షీ టీం ఎస్ఐ ప్రమీల ఆధ్వర్యంలో శివనగర్ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ఇక్కడ హెచ్‌ఎం మోతీలాల్, సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్, టీచర్లు ఉన్నారు.

## ప్రత్యామ్నాయ ఉపాధి చూపించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకుల వినతి


చైర్‌పర్సన్ కళకు వినతిపత్రం అందిస్తున్న ఆటోయూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మోహన్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 30: ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపించాలని జిల్లా ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత బొల్లి రామ్మోహన్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జిందం కళతో పాటు, పాలకవర్గ సభ్యులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మహిళలు ఆటోలో ప్రయాణించకపోవడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రతినెలా రూ.10వేల జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు వెంటనే రూ.5లక్షలు జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇక్కడ ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, యూనియన్ నాయకులు ఉన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహం


సింగారంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక


ఎంపీపీ రేణుక మాట్లాడుతుండగా అడ్డుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

- సింగారంలో ప్రజాపాలన సభకు కండువాలతో హాజరు
- మహిళా ఎంపీపీ రేణుక మాట్లాడుతుండగా అడ్డుకొని అవమానం
- హస్తంపార్టీ నాయకులపై గ్రామస్తుల అసహనం

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 30: అధికారంలోకి వచ్చి నెల కూడా గడువకముందే కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. శనివారం ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు మెడలో కండువాలు ధరించి హాజరయ్యారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మహిళా ఎంపీపీ పిల్లి రేణుక మాట్లాడుతుండగా అడ్డుకున్నారు. ఆమె కేసీఆర్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రస్తావించగా ఒక్కసారిగా వేదికపైకి దూసుకువచ్చారు. ప్రసంగానికి అడ్డుతగిలి బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా అని చూడకుండా తీవ్రంగా అవమానిస్తూ దుర్భాషలాడారు. వారి తీరుపై ఎంపీపీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమానికి పార్టీ కండువాలతో రావడమే గాకుండా దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. అయితే వేదికపై ఉన్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ కార్యకర్తలను వారించినా వినలేదు. కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలీపై గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన సభను సాయంత్రం 5 గంటలకు నిర్వహించడం.. దురుసుగా వ్యవహరించడంపై తీవ్రంగా మండిపడ్డారు.

## అభివృద్ధికి కట్టుబడి పని చేస్తాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మున్సిపల్ సమావేశానికి హాజరు


విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పూలమొక్క అందిస్తున్న చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు

వేములవాడ, డిసెంబర్30: వేములవాడ పట్టణంతోపాటు రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆయన హాజరు కాగా, చైర్‌పర్సన్ మాధవి, ఇన్‌చార్జి కమిషనర్ తహసీల్దార్ మహేశ్, కౌన్సిలర్లు సన్మానించారు. పట్టణంతోపాటు ఆలయంలోని పలు సమస్యల గురించి చైర్‌పర్సన్, కౌన్సిలర్లు విజయ్, సంతోష్ విప్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, పాదయాత్రలో భాగంగా వేములవాడకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఇక్కడి సమస్యలు వివరించానని, మరోసారి ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. తర్వాత ఉద్యోగ విరమణ చేసిన మున్సిపల్ సిబ్బందిగొట్టం అంజయ్య, చంద్రగిరి లలితను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు సంగె హనుమవ్వ, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జడల లక్ష్మి, నీలం కల్యాణి, జోగిని శంకర్, కందుల శ్రీలత, సిరిగిరి రామచందర్, యాచమనేని శ్రీనివాసరావు, కృష్ణవేణి, గడ్డమీది లావణ్య, బింగి మహేశ్, తిరుమల్‌రెడ్డి కవితారెడ్డి, చింతపంటి దివ్య, కొండపావని, కుమ్మరి శిరీష, రేగుల సంతోష్‌బాబు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, అన్నారం ఉమారాణి, గుడూరు లక్ష్మి, ముప్పిడి సునంద, గోలి మహేశ్, కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, బాబున్, నీరటి సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

### చందుర్తిలో విజయోత్సవ ర్యాలీ ..

చందుర్తి, డిసెంబర్ 30: మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో అండగా నిలిచి, అక్కునచేర్చుకున్న నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఇక్కడ జడ్పీటీసీ నాగం కుమార్, చింతపంటి రామస్వామి, నాయకులు పులి రేణుక, సత్యం, గణేశ్, ప్రభాకర్ ఉన్నారు.

## పారదర్శక సేవలు.. పటిష్ట భద్రత

- శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక నిఘా
- గతంలో కంటే నేరాల కట్టడిలో పోలీస్‌శాఖ సఫలం
- యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక కార్యాచరణ

రాజన్న సిరిసిల్ల నమస్తే తెలంగాణ/తెలంగాణ చౌక్, డిసెంబర్ 30: రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీస్ శాఖ స్నేహపూర్వక విధానం, పారదర్శక సేవలు అందించడంతో ప్రజల్లో పోలీస్‌శాఖపై విశ్వాసం మరింత పెరిగింది. మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం నేరుగా ఎస్పీ సేవలు విస్తరించడంతో శాంతిభద్రతల పరిరక్షణ, కచ్చితమైన సమస్యల పరిష్కారం లభిస్తుందనే గొప్ప నమ్మకం కలిగింది. ఎస్పీ అఖిల్ మహాజన్ తన ప్రత్యేక కార్యాచరణతో ప్రజలకు పోలీస్‌శాఖను మరింత దగ్గరయ్యేలా చేసింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రెండు నెలల పాటు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహించారు. గ్రామస్థాయిలో యువకుల భాగస్వామ్యంతో రోడ్డు సేఫ్టీ విలేజ్ కమిటీలను ఏర్పాటు చేసి 1500 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. షీ టీం ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలలు, పని ప్రదేశాల్లో అవగహన కల్పించారు. అలాగే పాఠశాల విద్యార్థుల రక్షణ కోసం ఆపరేషన్ జ్వాల ద్వారా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇప్పించారు. బస్సుల్లో మహిళల వేధింపులను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖకు అనుసంధానం చేశారు. ఆటోలు, ట్యాక్సీల్లో ప్రయాణించేటప్పుడు సమస్యలను అధిగమించడానికి 'అభయ్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మహిళల సంరక్షణే ధ్యేయంగా కమ్యూనిటీ పోలీసింగ్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో నేర నియంత్రణకు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ని ఏర్పాటు చేశారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నేరుగా సమర్థవంతమై సేవలు అందించడానికి ఠాణా దివాస్, గ్రీవెన్స్ డే, మెసేజ్ యువర్ ఎస్పీ(63039–22572) కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పోలీస్ సిబ్బంది ఒత్తిడిని అధిగమించడానికి స్పోర్ట్ మీట్ ఏర్పాటు చేశారు. అలాగే గల్ఫ్ మోసాలను కట్టడి చేయడానికి స్పెషల్ బ్రాంచి సీఐ స్థాయి అధికారిని ఏర్పాటు చేసి, మొబైల్ (87126–56411) నంబర్‌ను విస్తృతంగా ప్రచారం చేసి ఏజెంట్ల చేతిలో మోసం జరగకుండా అవగహన కల్పించారు.

### పారదర్శకమైన సేవలందిస్తున్నాం



ప్రజలకు మంచి పారదర్శకమైన సేవలను అందిస్తున్నాం. ఇందులో భాగంగానే సామన్య ప్రజలు సమస్యలు తీర్చడానికి అనేక వినూత్న కార్యక్రమాలు నిర్వహించాం. నేరుగా వారి వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని వాటిని చట్టపరంగా పరిష్కరిస్తున్నాం. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో చాలా వరకు ఉత్తమ ఫలితా లు సాధించాం. జిల్లాలోని మహిళల సంరక్షణే ధ్యేయంగా కమ్యూనిటీ పోలీసింగ్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

*- అఖిల్ మహాజన్, ఎస్పీ*

**జిల్లాలో ఈ ఏడాది వివిధ కేసుల వివరాలు ఇలా ఉన్నాయి**

| ఏడాది | కేసులు | అరెస్టులు | గంజాయిసీజ్ (కేజీలు) |
|---|---|---|---|
| 2022 | 16 | 54 | 3.779 |
| 2023 | 59 | 127 | 70.793 |

| కేసులు | 2022 | 2023 |
|---|---|---|
| రోడ్డు ప్రమాదాలు | 197 | 218 |
| సైబర్ నేరాలు | 67 | 60 |
| డ్రంక్ అండ్ డ్రైవ్ | 3,642 | 7,574 |

**వివిధ నేరాలు**

| నేరం | 2022 | 2023 |
|---|---|---|
| హత్యలు | 18 | 12 |
| హత్యాయత్నాలు | 52 | 39 |
| ఆత్మహత్యలు | 181 | 143 |
| వరకట్న మరణాలు | 04 | 21 |
| అపహరణలు | 23 | 28 |
| ఎస్సీ ఎస్టీ చట్టం | 68 | 69 |
| ఫోక్సో చట్టం | 60 | 44 |
| చీటింగ్ | 256 | 329 |

## సకాలంలో రుణాలు చెల్లించాలి


రైతులకు రుణాల చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

వేములవాడ రూరల్, డిసెంబర్ 30: రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని వేములవాడ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం సహకార సంఘంలో రైతులకు దాదాపు రూ.40లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఇక్కడ డైరెక్టర్లు రాజయ్య, సురేందర్ రెడ్డి, నాయకులు తిరుపతినాయక్, సీఈవో లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

### నకిలీ మావోయిస్టు అరెస్ట్

తెలంగాణ చౌక్, డిసెంబర్ 30: తాను మావోయిస్టునని, పార్టీ బలోపేతానికి డబ్బు కావాలని బెదిరింపులకు పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ శనివారం తెలిపారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి గతంలో మావోయిస్టు సానుభూతిపరుడిగా పని చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో సిరిసిల్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటుకం సత్తయ్యకు ఫోన్ చేసి డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో 'లీడ్ ది ఫ్యూచర్'

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 30: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం లీడ్ ది ఫ్యూచర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓమౌజాయ యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెబ్ డిజైనింగ్, చాట్ జీపీటీ అంశాలపై సాంకేతిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐఏయూవైఎస్ఏ కోర్ టీంలో యువకులు ఉద్యోగాలు చేస్తూ, అభివృద్ధి కోసం సేవ చేయడం హర్షనీయమని ప్రిన్సిపాల్ రజినీ పేర్కొన్నారు. అనంతరం వెగాల్డ్ టెక్నాలజీస్ నైపుణ్య డైరెక్టర్లు హరిబాబు, నిఖిల్‌రెడ్డి వెబ్‌సైట్ డిజైనింగ్‌పై యువతకు శిక్షణ అందించారు. ఇక్కడ ఐఏయూవైఎస్ఏ అధ్యక్షుడు తిరుమల రుషి, గర్ల్స్ అధ్యక్షురాలు సింధు ఉన్నారు.



లీడ్ ది ఫ్యూచర్ కార్యక్రమంలో విజయసంకేతం చూపుతున్న విద్యార్థినులు

## బండపల్లివాసికి రజత పతకం


పతకం అందుకుంటున్న మునీందర్‌రెడ్డి

చందుర్తి, డిసెంబర్ 30: హైదరాబాద్‌లోని నిర్వహించిన వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో బండపల్లి గ్రామానికి చెందిన చింతల మునీందర్‌రెడ్డి రజత పతకం సాధించాడు. 50 సంవత్సరాల పైబడిన వారికి నిర్వహించిన పోటీల్లో పాల్గొని పతకం సాధించడంతో గ్రామస్తులు అభినందించారు. ఫిబ్రవరి 6న గచ్చిబౌలి స్టేడియంలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

## విద్యా సంస్థలో న్యూ ఇయర్ వేడుకలు


న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 30: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్‌స్కూల్‌లో శనివారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం వివిధ రకాల గ్రీటింగ్స్ తయారుచేసి ప్రదర్శన నిర్వహించారు. ఇక్కడ కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ, ప్రిన్సిపాల్ కళ్యాణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### ప్రైవేట్ టీచర్ కర్కశత్వం

వేములవాడ, డిసెంబర్ 30: స్కూల్ యూనిఫాం వేసుకొని రాలేదని ఓ విద్యార్థినిని నాలుగు గంటల పాటు నేలపై కూర్చోబెట్టి ప్రైవేట్ పాఠశాల టీచర్ కర్కశంగా వ్యవహరించిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో జరిగింది. విద్యార్థిని తండ్రి నరాల శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడకు చెందిన నరాల శేఖర్ కూతురు శాంభవి పట్టణంలోని హంసిని స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నది. అయితే శనివారం రెగ్యులర్ స్కూల్ యూనిఫాంతో పాఠశాలకు వెళ్లింది. అయితే శనివారం వైట్ యూనిఫాంతో ఎందుకురాలేదని మండిపడ్డ క్లాస్ టీచర్, ఆమెను క్లాస్ రూమ్‌కు వెళ్లనివ్వకుండా ఆవరణలో నాలుగు గంటల పాటు కింద కూర్చోబెట్టారు. దీంతో విద్యార్థినికి కాళ్లనొప్పులు రావడంతో స్కూల్ ముగిసిన తర్వాత ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తాత నరాల దేవయ్యకు విషయాన్ని చెప్పింది. వెంటనే తాత దేవయ్య స్కూల్‌కు వెళ్లి అడుగగా, కరస్పాండెంట్ పనిష్మెంట్ ఇవ్వాలని చెప్పినందునే కింద కూర్చోబెట్టినట్లు టీచర్ సమాధానం ఇచ్చారని, ఇలా పాఠశాల యాజమాన్యం చిన్నారులని కూడా చూడకుండా శిక్షించడం సరికాదని నరాల శేఖర్ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌కు ఫిర్యాదులో పేర్కొన్నారు. హంసిని స్కూల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకొని మరో విద్యార్థికి ఇలా జరగకుండా చూడాలని కోరారు. పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.